మాదకద్రవ్యాల నివారణకు కృషి చేయాలి



నాచారం పారిశ్రామికవాడలో ర్యాలీలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్, తదితరులు

మల్లాపూర్: ఆరోగ్యానికి హానిచేసే మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నాచారం పారిశ్రామిక వాడలో కోహన్స్, సాయిక్రిష్ణ, అరగోర్న్ కంపెనీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ హాజరయ్యారు, పోలీసులు శుక్రవారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ గంజాయి, మద్యానికి యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నార్కోటిక్స్ సూపరింటెండెంట్ మురళీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్లు హేమా కుమార్, మనీష్ తిపాఠీ, బారున్ పాండే, ముఖర్జీ,ఎస్,ఐ గంగాధర్ రెడ్డి, కోహ న్స్ జీఎం కె.వెంకటారావు, బాలాజీ, మహేష్, కోహన్స్, సాయి క్రిష్ణ, అరగో ర్న్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బోడుప్పల్ మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిర విగౌడ్‌లపై శనివారం అవిశ్వాస తీర్మానం జరగనున్నది. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి ప్రొసీడింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటలకు మేయర్‌పైన, 12.30 గంటలకు డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం జరుగుతుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు మేడిపల్లి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్‌లో ఉన్న 22 మంది కాంగ్రెస్‌పార్టీ కార్పొరేటర్లు నగర శివారు ప్రాంతంలో బస చేసి శనివారం ఉదయం 11 గంటలకు నేరుగా బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే అవిశ్వాస తీర్మానంలో పాల్గొనున్నారు.

బోనాల పండుగ ఏర్పాట్లకు ప్రతిపాదనలు

మల్కాజిగిరి: బోనాల జాతరలో భాగంగా మల్కాజిగిరి డివిజన్‌లో ఇంజనీరింగ్ విభాగం నుండి ప్రతిపాదనలు సిద్ధం చేశామని కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. మల్కాజిగిరి డివిజన్‌లోనే మహంకాళి అమ్మవారి దేవాలయంతో పాటు పలు ప్రముఖ దేవాలయాలు ఉన్నాయని ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేయాల్సిన పనులు, వాటికి అయ్యే ఖర్చుల ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.ఎల్‌కె ఆస్పత్రి ప్రధాన రహదారి,ఓల్డ్ నేరెడ్‌మెట్ రహదారి,ఆర్‌సీసీ డ్రైన్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసామని అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారన్నారు.సమావేశంలో ఏఈ దీపక్ , వివి రమేష్ పాల్గొన్నారు.

జంక్షన్ల విస్తరణ కోసం ఎమ్మెల్యే మౌన దీక్ష


ఓల్డ్ అల్వాల్ చౌరస్తాలో మౌన దీక్ష చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి అవసరమయ్యే నిధులు ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబించడంపై నిరసన వ్యక్తం చేస్తూ మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఓల్డ్ అల్వాల్ చౌరస్తా వద్ద మౌన దీక్ష చేశారు. అల్వాల్ సర్కిల్ పరిధిలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి ఓల్డ్ అల్వాల్ చౌరస్తాలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద మౌన దీక్ష చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్వాల్‌కు ప్రధాన చౌరస్తా అయిన ఓల్డ్ అల్వాల్‌లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని గుర్తించిన గత ప్రభుత్వం అధికారుల నుండి ప్రతిపాదనలు తీసుకుని నిధులు మంజూరు చేసినప్పటికీ కొందరి నిర్లక్ష్యం వలన జంక్షన్ అభివృద్ధి కాలేకపోయిందన్నారు. దీంతో నిత్యం ప్రజలు ట్రాఫిక్‌తో నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడంలో అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని విమర్శించారు. ప్రజల నుంచి సేకరించిన పన్నులతోనే అధికారులకు జీతాలు తీసుకుంటున్నారన్నా విషయం మర్చిపోవద్దన్నారు.

◆ అనంతరం అల్వాల్ చిన్నన్న తోటలోని ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అల్వాల్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు చేయడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎస్ఐ. ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో ధ్రువపత్రాలు ఇవ్వాలి

అల్వాల్: మల్కాజిగిరి మండల ముదిరాజ్ సంఘం , మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న ముదిరాజ్ సామాజిక వర్గం ముదిరాజ్ కులస్తులకు సకాలంలో ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని మండల తహసీల్దార్ సీతారాంకు ముదిరాజ్ మహా సభ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు చెరుకు సాంబరాజు, గౌరవ అధ్యక్షులు రొయ్యల కృష్ణమూర్తి ముదిరాజ్ పాల్గొన్నారు.

బాలాజీ ఆలయ హుండీ లెక్కింపు

అల్వాల్: అల్వాల్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర ఆలయ హుండీ లెక్కింపు శుక్రవారం దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి డి.రవి కుమార్ జరిగింది. మూడు నెలలకు గాను రూ. 2,91,000 ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ రాజా సంజయ్ గోపాల్ సయించర్, కార్యనిర్వాహణధికారి మఠంరావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులు.. సమస్యలు మెండు

రామంతాపూర్ జడ్పీ హైస్కూల్‌లో చెట్ల కిందే బోధన

- ప్రగతినగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోనే వాహనాల పార్కింగ్
- శిథిలావస్థకు చేరుకున్న ఇందిరానగర్ ఉర్దూ స్కూల్

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు ప్రగతినగర్, ఇందిరానగర్, రాజేంద్రనగర్, వెంకట్‌రెడ్డినగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. పాలకులు పట్టించుకోకపోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా పరిషత్ హైస్కూల్

ఓల్డ్ రామంతాపూర్‌లో గల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాలతో పాటు హైస్కూల్‌లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ , తెలుగు మీడియం కలిపి మొత్తం 20 సెక్షన్లు ఉన్నాయి. అవసరమయ్యే 20 తరగతి గదులకు గాను కేవలం 14 గదులు ఉండటం వల్ల మిగతా ఆరు తరగతి గదులు విద్యార్థులను విడతల వారీగా చెట్ల కింద కుర్చోబెట్టి ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఈ ప్రాంగణంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను వేరే చోటికి అయిన తరలించాలని లేదా మరిన్ని అదనపు తరగతి గదులు నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


పార్కింగ్‌కు అడ్డాగా మారిన ప్రగతి నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

పార్కింగ్ అడ్డాగా ప్రాథమిక పాఠశాల

ప్రగతినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణానికి ప్రహరీ లేకపోవడంతో స్థానికులు తమ కార్లను ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర కమర్షియల్ వాహనాలను కూడా ఈ స్కూల్ ప్రాంగణంలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పార్కింగ్ అడ్డాగా మారిన స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు ఆటలాడు కోడానికి కూడా స్థలం సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే స్కూల్‌కు ప్రహరీ కూడా నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రామంతాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చెట్ల కిందనే చదువులు

శిథిలావస్థలో ఉర్దూ స్కూల్..

ఇందిరానగర్ ఈద్గాలో ఉన్న ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇది ఎప్పుడు కూలి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్ పంపడానికి కూడా ఆసక్తి చూడపం లేదు. వెంటనే స్కూల్ భవనాన్ని మరమ్మతులు చేయాలని లేదా కొత్త భవనమైన నిర్మించాలని, అందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ పాఠశాలలతో పాటు వెంకట్‌రెడ్డినగర్, రాజేంద్రనగర్‌లలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సరిపోని తరగతి గదులు లేక ఒక్కొక్క తరగతి గదిలో అన్ని తరగతుల విద్యార్థులని ఒక చోట కూర్చుని పెట్టి పాఠాలు బోధించడం వల్ల పాఠాలు అర్థం కాక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు.


ఇందిరానగర్ ఉర్దూ పాఠశాల

ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలి


రామంతాపూర్‌లో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న పలు సమస్యల గురించి విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించిన పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు అయిన అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి. అధిక ఫీజులు చెల్లించి కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్‌లో వెళ్లలేని విద్యార్థులకు ఈ పాఠశాలలో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలి.

– బైగళ్ళ జంగయ్య, విద్యా కమిటీ మాజీ ఛైర్మన్

కమిషనర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు


మల్లాపూర్: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలి ని శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మల్లా పూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వాణీనగర్ సమస్యలు పరిష్కరించాలి


గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ వాణినగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు, కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నారు. కాలనీ అధ్యక్షులు సిద్దయ్య, నర్సింగ్‌రావు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ ఈటల

రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: కేంద్ర రోడ్డు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మర్యాద పూ ర్వకంగా కలిశారు. ఢిల్లీలో ఆయనను కలిసిన రాజేందర్ రాష్ట్రంలోని పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కొంపల్లి ఫ్లై ఓవర్ల అండర్ పాస్, నత్తనడకన సాగుతున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్, శామీర్‌పేట రోడ్డు, ఎల్‌బీనగర్ అండర్‌పాస్, హుజూరాబాద్ రోడ్డు సమస్యలపై చర్చించారు. హైదరాబాద్‌లో నిర్మించే అన్నీ అండర్‌పాస్‌లు కాకుండా ఫ్లై ఓవర్లు నిర్మించాలని కోరారు. హుజూరాబాద్‌లో సింగాపూర్, రాంపూర్, రంగాపూర్, పెద్దపాపాయపల్లి ప్రాంతాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. ఈటల రాజేందర్ లేవనెత్తిన సమస్యలపై స్పందించిన నితిన్ గడ్కరీ మరోసారి సమగ్రంగా సమావేశం ఏర్పాటు చేసి స మస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


మల్కాజిగిరి: నేరెడ్‌మెట్‌లోని జిల్లా ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అక్షర కౌముది సంస్థ, త్రి శక్తి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉభయ సంస్థల అధ్యక్షులు తులసి విజయలక్ష్మి, సూర్యకుమారిలు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సామాజిక, సాహిత్య,సేవారంగాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు సంస్కృతి, సాంప్రదాయాలు, తెలుగు భాష ఔన్నత్యం పై పలు పోటీలు, ప్రముఖ కవులతో సమ్మేళనాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు తులసి రమణాచార్యులు, మాధవి, శ్రీనివాసరావు, రామసాయి,బాబు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీతా యాదవ్

మౌలాలి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య కార్మికులకు మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ సూచించారు. శుక్రవారం శానిటేషన్, అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ చెత్తను తొలగించడంలో కార్మికులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రోడ్లపై ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించి చెత్త రిక్షాలకు వేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సీఎస్‌డీ ఇన్‌చార్జి శశాంక్, రాజ్‌కుమార్, రాంకీ ఇన్‌చార్జి దయానంద్, శానిటే షన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలకు నూతన మూతలు వేయండి


ఇందిరానెహ్రునగర్‌లో..


జయగిరి శ్రీలక్ష్మీనర్సింహ స్వామినగర్ చౌరస్తాలో ..

గౌతమ్‌నగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రునగర్, జయగిరి లక్ష్మీనర్సింహ స్వామినగర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతలు విరిగి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్ కవర్లు ధ్వంసం కావడంతో రాత్రి సమయాల్లో ప్రయాణం సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ మూతలు తొలగించి నూతన మూతలు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్..

ఆటో దొంగ అరెస్ట్


నిందితుడు ఆనంద్‌కుమార్

మల్కాజిగిరి: పార్కింగ్ చేసిన ఆటోను దొంగలించిన వ్యక్తిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 26న మల్కాజిగిరికి చెందిన ధర్మేందర్ టీ తాడానికి వెళ్తూ తన ఆటోను మల్కాజిగిరి లోని గాంధీపార్కు వద్ద పార్కింగ్ చేశాడు. కొద్ది సేపటి తర్వాత ఆటో కనిపించకపోవడంతో మల్కాజిగిరి పోలీసులు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం ఆటోను దొంగలించిన నేరేడ్‌మెట్‌కు చెందిన ఆనంద్‌కుమార్(51) అరెస్ట్ చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డిఐ శ్రీశైలం తెలిపారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుమానాస్పద మృతి

ఉప్పల్: హాస్టల్‌లో నివాసముంటున్న రియల్ వ్యాపారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. తిరుపతి ప్రాంతానికి చెందిన కొనిమిల కిషోర్ వర్మ(47) ఉప్పల్ లక్ష్మారెడ్డి కాలనీలోని ఆరోగ్య హాస్టల్‌లో 20 రోజుల నుంచి ఉంటున్నాడు. గురువారం రాత్రి పలు మార్లు వాంతులు చేసుకున్నాడు. ఆసుపత్రికి వెళ్లకుండా అక్కడే నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారే సరికి మృతి చెందాడు. స్నేహితులు పోలీసులు పిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

కుటుంబ సభ్యులను బెదిరించారంటూ ఫిర్యాదు

బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి జారీ చేసిన విప్ పత్రాల ను అందించేందుకు వచ్చి తమ కుటుంబ సభ్యులను బెదిరించారని బోడుప్పల్ 1వ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ కుమారుడు యోగేష్ యాదవ్ వెల్లడించారు. చెంగిచర్లలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ మా చెల్లెలు చేతిలో విప్ నోటీసు పత్రాలు పెట్టి , బలవంతంగా సంతకం తీసుకున్నారన్నారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

పని లభించక కూలీ ఆత్మహత్య

ఉప్పల్: పని లభించక కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. నల్గొండ జిల్లా అడవి దేవుల పల్లి ప్రాంతానికి చెందిన బి. వెంకట రమణ(21) పనికోసం నగరానికి వచ్చాడు. అయితే ఎక్కడా పని దొరక లేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వెంకట రమణ ఈ నెల 13నా రామంతాపూర్‌లోని బావమరిది ఇంటికి వచ్చాడు. అక్కడ పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


కుషాయిగూడ: ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని శుక్రవారం కుషాయిగూడ పోలీసులు గుర్తించారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, కై లాసగిరిలో సుమారు 50–55 సంవత్సరాలు కలిగిన వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహాంగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంగ తరలించినట్లు తెలిపారు. మృతుడికి సంబంధించి వ్యక్తులు ఉంటే కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ స్వరూప్‌నగర్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సౌత్ స్వరూప్‌నగర్, కేకే ఆర్ గార్డెన్, గాంధీనగర్, అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నిఖిల్ తెలిపారు. 12.30 గంటల నుంచి ఒంటి గంట వరకు వేంకటేశ్వర్ దేవాలయం, సెవెన్ హిల్స్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, పద్మావతి కాలని, శ్రీనగర్ కాలని తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవి కళ్యాణపురి ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 వరకు ఎన్‌జీఆర్, జాహీద్ నగర్, బ్యాంక్ కాలని, ఇందిరానగర్, అంబేద్కర్ నగర్, సీతారామ కాలనీ, ఈస్ట్ కళ్యాణ పురి, నార్త్ కళ్యాణ పురి, బాలాజీ ఎన్‌క్లేవ్, రాఘవేంద్రానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్: గ్రీన్ హిల్స్ కాలనీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు గ్రీన్ హిల్స్ కాలని, బృందావన్ కాలని, వసంత్ విహార్ కాలని,వివి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ రామి రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు జీఎస్‌ఎన్ కాలని, మహేశ్వరినగర్, ఎస్ఎస్ నగర్, రవీంద్రానగర్ రోడ్ నంబర్ 1 నుంచి 6 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


నియామకపు ఉత్తర్వులను అందజేస్తున్న దృశ్యం

మల్లాపూర్: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్కాజిగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా శైలజా, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణిగౌడ్, ఉపాధ్యాక్షురాలిగా కళావతి, ప్రధాన కార్యదర్శిగా ఇంతియాజ్ బేగంలను నియమిస్తూ ఉత్తర్వులను అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఉప్పల్ కార్పొరేటర్ రజితరెడ్డిలు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కప్పెర సాయిగౌడ్, ఎస్సీసెల్ అధ్యక్షులు మనోహర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫసియుద్దీన్, జమిలాభేగం,బాలారాజ్ గౌడ్, కిట్టు, సోనీ,లావణ్య, తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

బోడుప్పల్: ప్రయాణికుల రవాణా సంబంధిత సమస్యల పరిష్కారానికి శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత వెల్లడించారు. ఆర్టీసీ డిపో పరిధిలోని ఆయా రూట్లకు సంబంధించి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలిపేందుకు నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని శుక్రవారం కోరారు. శనివారం సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. 7893088433, 9110505820 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

రూ .14 లక్షలతో అభివృద్ధి పనులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో రూ.14 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ స్టాండింగ్ కమిటి సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి ప్రారంభించారు. చిలుకానగర్‌లో ధర్మపురి కాలనీలో రూ. 14 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శుంకుస్థాపన చేసారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, స్థానిక బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో నీటి పొదుపు


ఇంకుడు గుంతను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: నీటిని పొదుపు చేయడానికి ఇంకుడు గుంతలు దోహదపడుతాయని కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ అన్నారు. శుక్రవారం గౌతంనగర్ డివిజన్ భవానీనగర్‌లో కాలనీవాసులు ఏర్పాటుచేసిన ఇంకుడు గుంతను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, బైరు అనిల్, భవానీనగర్ కాలనీ ప్రతినిధులు ప్రసాద్, శశికుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవ నిధులకు దరఖాస్తు చేసుకోండి

మల్కాజిగిరి: బోనాల జాతర సందర్భంగా దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఆలయ కమిటీ తరుపున దరఖాస్తు(లెటర్ హెడ్ పైన), ఆలయ ఫోటోలు, బ్యాంక్ ఖాతా వివరాలు, ప్రధాన నిర్వాహకుడి ఆధార్‌కార్డు, గత సంవత్సరం మంజూరైన నిధికి సంబందించిన చెక్ జిరాక్స్ క్యాంపు కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 9154959927,9133999507 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహావిష్కరణ


మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ విష్ణుపురి కాలనీలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో పద్దెనిమిది అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాన్ని చల్లా ఇందిరా కృష్ణమూర్తి తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయించారు.